
తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT



**కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్చెరు , డైలీ రిపోర్ట్ జనవరి 04

2లో..

సంపుటి 1 సంచిక :152. ఎడిటర్: దాస శ్రీనివాస్ ప్రచురణ: హైదరాబాద్ ఆదివారం 5-01-2025 వెల: 5/రూ.

# రైతు భరోసా 12 వేలు

- సాగు యోగ్యమైన భూములన్నింటికీ వర్తింపు
- భూమి లేని రైతు కుటుంబాలకు ఏటా 12 వేలు
- 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'గా పథకం
- రేషన్ కార్డులు లేనివారికి నూతన కార్డులు
- ఈ 3 పథకాలు ఈ నెల 26 నుంచి అమల్లోకి
- వ్యవసాయ యోగ్యం కాని భూమికి భరోసా ఇవ్వం
- గతంలో 'ధరణి' వల్ల కొన్ని భూములకు అందింది
- రెవెన్యూ సిబ్బంది గ్రామాలవారీ వివరాల సేకరణ
- క్యాబినెట్ భేటీ నిర్ణయాలను వెల్లడించిన సీఎం
- గతంలోకి వెళితే కేసీఆర్ కుటుంబానికి..
- వెయ్యేళ్ల జైలుశిక్ష అంటూ విమర్శ



**తెలంగాణ బ్యూరో, జనవరి 4 (డైలీ రిపోర్ట్):**
రైతు భరోసా పథకం కింద రైతులకు ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. దీంతోపాటు భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు ఏటా రూ.12 వేల చొప్పున ఆర్థికసాయం చేస్తామని తెలిపారు. ఈ పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'గా నామకరణం చేసినట్లు పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో రేషన్ కార్డులు లేనివారందరికీ నూతన రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. ఈ మూడు పథకాలను ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలు చేస్తామని ప్రకటించారు. శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. సచివాలయంలోని క్యాబినెట్ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన దాదాపు మూడు గంటలపాటు మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం క్యాబినెట్ భేటీ వివరాలను మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మీడియాకు వివరించారు. సీఎం మాట్లాడుతూ, ''తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఈ నూతన సంవత్సరంలో మంచి జరగాలని, ఈ ప్రభుత్వం వారిని ఆదుకోవాలని, వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని మా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అన్నారు.

# కేంద్రంలో చక్రం తిప్పుతాం


**ఆరు గ్యారెంటీల గురించి ప్రశ్నిస్తుంటే.. నన్ను ఆరు కేసుల్లో ఎలా ఇరికిద్దామా అనే ప్రయత్నం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం.**

**వాళ్లు కేసుల గురించి ఆలోచిస్తుంటే.. మనం రైతుల గురించి, ప్రజల గురించి మాట్లాడుదాం.**

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**




**సిరిసిల్ల, జనవరి 4 (డైలీ రిపోర్ట్):**
''పది, పదిహేను మంది ఎంపీలతో నితీష్‌కుమార్, చంద్రబాబు కేంద్రంలో చక్రం తిప్పుతున్నారు. వారిలాగే మనకూ ఒక రోజు వస్తుంది. తప్పకుండా కేంద్రంలో చక్రం తిప్పుతాం'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. చిన్న, చిన్న పొరపాట్ల వల్ల గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓడిపోయామని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ కారణంతోనే మంచి వాళ్లను ప్రజలు కాదనుకుని, అటు బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు ఎనిమిదేసి చొప్పున సీట్లు ఇచ్చారన్నారు. సంవత్సరం గడిచినా కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులు గుండుసున్నా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చి నాలుగు వందల రోజులు గడిచినా.. ఆరు గ్యారెంటీలకు దిక్కు లేకుండా పోయిందని విమర్శించారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మూడు పంటలకు రైతు బంధు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రైతు భరోసాకు రైతుల నుంచి ప్రమాణ పత్రాలు అడగడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు రైతు బంధు కోసం ఎవరికీ దండం పెట్టలేదని, దరఖాస్తు ఇవ్వలేదని గుర్తు చేశారు. ఉద్యోగులకు, ఐటీ కట్టేటోళ్లకు భరోసా కట్ చేస్తానని చెప్పడం సరికాదన్నారు. సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు.. కటింగ్ మాస్టర్ అన్నట్టుగా పరిస్థితి ఉందన్నారు. మొహం బాగ లేక అద్దం పగులగొట్టినట్లు.. పరిపాలన చేతకాక రాష్ట్ర పరిస్థితి బాగా లేదని చెబుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలపై ప్రతి నెలా ఒక్కో కార్యక్రమం పెట్టుకుందామని, కాం గ్రెస్ ప్రభుత్వాన్ని ఉక్కిరి బిక్కిరి చేసే బాధ్యత ప్రధాన ప్రతిపక్షంగా గులాబీ దండుదేనని అన్నారు. న్యాయ నిపుణుల సూచన మేరకు ఫార్ములా–ఈ కేసులో విచారణకు హాజరవుతానని తెలిపారు. ఏసీబీ, ఈడీ పెట్టినవి తప్పుడు కేసులేనని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా తనపై ఆరు కేసులు పెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గెలిస్తే సీఎం రేసులో కేటీఆర్, కవిత ఉంటారంటూ జరుగుతున్న ప్రచారం తప్పని, కొందరు బుద్ధి తక్కువవాళ్లు చేసే ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సీఎం కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని, కచ్చితంగా అవుతారని పేర్కొన్నారు. మేడిగడ్డ కొట్టుకుపోవాలని, కేసీఆర్‌కు చెడ్డపేరు రావాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. సంవత్సరం గడిచినా బ్యారేజీకి ఎందుకు మరమ్మతు చేయడం లేదని, బ్యారేజీని వీళ్లే ఏదో చేశారని తనకు అనుమానం ఉందని అన్నారు.



# చట్టసభల్లో మహిళల సంఖ్య పెరగాలి: ఎంపీ డీకే అరుణ

**తెలంగాణ బ్యూరో, జనవరి 4 (డైలీ రిపోర్ట్):**
రాజకీయాల్లో మహిళలు రాణించడం అంత సులువు కాదని, ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని ఎదుర్కొని మహిళలు రాజకీయ రంగంలో రాణించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం పెరగాలని ఆకాంక్షించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల్లో భాగంగా శనివారం జరిగిన మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో డీకే అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

# తెలుగు మీడియంపై అపోహలు

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులను పూర్తిగా తెలుగు మాధ్యమంలో బోధించేందుకు పెద్ద ఎత్తున కృషి జరగాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభిలషించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన పదకోశాలు తెలుగులో మరిన్ని రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆంగ్లం మోజులో పడి తెలుగును నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదన్నారు. తెలుగు మీడియంలో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహను వీడాలన్నారు.

# General News జనరల్ న్యూస్

## జూనియర్ కాలేజీల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం



- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్రంలోని అన్ని జూనియర్ కాలేజీల్లో
- శనివారం నుంచి ప్రారంభం అయింది
- 475 కాలేజీల్లో 1.48 లక్షల విద్యార్థులకు అమలు
- ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల జూనియర్ ఇంటర్మీడియట్ కళాశాలలో పథకాన్ని ప్రారంభించిన ఏపీ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య

**ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల: జనవరి 04**

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్రంలోని అన్ని జూనియర్ కాలేజీల్లో శనివారం నుంచి ప్రారంభమైంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ క్రమంలో మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల్లో చదువే విద్యార్థుల భవిష్యత్తు చాలా ముఖ్యం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 475 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే 1.48 లక్షలమంది ఈ పథకం వల్ల నేరుగా లబ్ధి పొందనున్నారన్నారు. ఈ పథకంలో భాగంగా.. 398 కాలేజీలను సమీపంలోని పాఠశాలలకు అనుసంధానం చేశారని తెలిపారు. ఆ పాఠశాలల్లో భోజనం తయారుచేసి కాలేజీలకు పంపుతారు. మిగిలిన 77 కాలేజీలను సెంట్రలైజ్డ్ కిచెన్‌లకు అనుసంధానించారన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరంలో మిగిలిన కాలానికి రూ.27.39కోట్లు ఖర్చు చేయనుందన్నారు.గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉందని, వైసీపీ ప్రభుత్వం దానిని రద్దుచేయడంతో ఆ నిర్ణయం పేద విద్యార్థులపై ప్రభావం చూపిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేష్ చొరవతో మధ్యాహ్న భోజన పథకం లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, ఇంటర్ విద్యలో సంస్కరణలు ప్రారంభించారన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచడం లక్ష్యంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసిందన్నారు. దీంతో ఈ పథకాన్ని తిరిగి అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. అలాగే వచ్చే ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.



సృజన హాస్పిటల్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్

## ప్రైవేట్ స్కూల్ విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధించాలి

### ట్రస్ట్ సెక్రటరీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి, డైలీ రిపోర్ట్: జనవరి 04**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ స్కూల్ విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని బీజేపీ శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాల , కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ మరియు ఆర్.కే. వై ఫౌండేషన్ సౌజన్యంతో దాదాపు 300ల మంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సెక్రటరీ, కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వం పెంపొందించుకొని, క్రమశిక్షణ,పట్టుదలతో ట్రస్టు అందిస్తున్న స్టడీ మెటీరియల్ నుసద్వినియోగపరచుకున్నట్లయితే పదవ తరగతిలో మంచి మార్కులు సాధిస్తారు, గొప్ప గొప్ప చదువులు చదివి భవిష్యత్తులో మీరు ఉన్నత స్థాయికి వెళ్లి సమాజానికి సేవ చేయాలని వారుతెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, ప్రసాద్ రెడ్డి, మన్యంకొండ,పద్మ ,మల్లేష్, వెంకటేష్, రేఖ, సరోజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కేటీఆర్ కు శుభాకాంక్షలు



**శేరిలింగంపల్లి, డైలీ రిపోర్ట్: జనవరి 04**

ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం రోజు బిఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ను మర్యాద పూర్వకంగా కలిసిన బిఆరెస్ నాయకులు గోపరాజు శ్రీనివాస్ రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 04:(డైలీ రిపోర్ట్):**

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కలెక్టర్‌తో చర్చించారు.నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తిచేయాలని కలెక్టర్ ను కోరారు.గత ప్రభుత్వంలో మంజూరైన నిధులను విడుదల చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలెక్టర్ ను కోరారు.

# మైనంపల్లికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన... కొప్పిశెట్టి, గంధం.



కూకట్ పల్లి, జనవరి 04 (డైలీ రిపోర్ట్) :
కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ, మల్కాజ్గిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మైనంపల్లి హనుమంతరావును కాంగ్రెస్ నాయకులు కపిల్ రాజ్, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి దినేష్ కుమార్, కెపిహెచ్బి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మైనంపల్లి మాట్లాడుతూ ఈ కొత్త సంవత్సరం ప్రజలందరికీ మంచి జరగాలని, రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీ అందించే పథకాలు ప్రజలకు నూతన సంవత్సర కానుకలుగా చేరుతాయని తెలిపారు. అనంతరం బల్కంపేట్ ఎల్లమ్మ తల్లి దేవాలయంలో సోదరులు ప్రభాకర్ కుటుంబం ఆహ్వానం మేరకు అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈ.వో . హనుమంతరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంట శ్రీనివాస్ గౌడ్, రాజేష్ యాదవ్, సుబ్బు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు , డైలీ రిపోర్ట్ జనవరి 04**



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, డివిజన్లు, మున్సిపాలిటీలకు చెందిన 125 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన ఒక కోటి 25 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో అరులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తహసీల్దార్లు రంగారావు, రాధ, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 8న దివ్యాంగుల కొరకు ప్రత్యేక జాబ్ మేళా ... జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి బ్యూరో, డైలీ రిపోర్ట్: జనవరి 04**

- అంధుల అక్షర ప్రధాత లూయిస్ బ్రెయిలి 216వ జన్మదిన వేడుకలు.
- దివ్యాంగుల ప్రజావాణి కి 14 దరఖాస్తులు
- ఈనెల 8న దివ్యాంగుల కొరకు ప్రత్యేక జాబ్ మేళా ... జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

జిల్లా మహిళా శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖఆధ్వర్యంలో అంధుల అక్షర ప్రదాత లూయి బ్రెయిలీ 216 వ జన్మదిన వేడుకలు శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు హాజరై కలెక్టరేట్లోని లూయి బ్రెయిలీ విగ్రహానికి పూలలంకరణ గావించి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి జన్మదిన వేడుకలు ప్రారంభించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లూయి బ్రెయిలీ తనకు అంధత్వం వచ్చిందని బాధపడకుండా అంధులు చదువుకోడానికి వీలుగా ప్రత్యేక లిపిని కనుగొన్నారని అన్నారు. బ్రెయిలి లిపి ద్వారా అంధులు చదవగలగటం ప్రారంభించి, తమ జీవితాల్లో స్వావలంబన సాధించారు. బ్రెయిలి లిపి ఆధారంగా కంప్యూటర్లలో బ్రెయిలి స్క్రీన్ రీడర్‌లు, టచ్ స్క్రీన్ బ్రెయిలి పరికరాలు అభివృద్ధి చెందాయని తెలిపారు . బ్రెయిలి లిపి ఒక సింపుల్ కాన్సెప్ట్ అయినా, అంధుల చదవడం, వ్రాయడం, విద్యను స్వేచ్ఛతో పొందడంలో గణనీయమైన మార్పు తీసుకొచ్చింది. ఈ లిపి 6 బిందువుల ఆధారంగా రూపొందించబడింది, ఇది అక్షరాలు, సంఖ్యలు, సంగీతం వంటి వివిధ అంశాలను సులభంగా ప్రదర్శించగలుగుతుంది. బ్రెయిలీ లిపి ఆధారంగా ఎంతోమంది అంధులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు . సివిల్ సర్వీసులల్లో ర్యాంకులు సాధించి కలెక్టర్లు అవుతున్నారని గుర్తు చేశారు . అంధులు సామాన్యులకు కూడా తీసిపోకుండా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అంధులు అందరూ తమ వైకల్యాన్ని మరచి, మనోధర్యంతో పట్టుదల వదలకుండా కృషిచేసి విజయం సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. జిల్లాలో అందులో కోసం ప్రత్యేకంగా సౌండ్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు .లూయిస్ బ్రెయిలి అందరికి మార్గదర్శనం, అంధుల పట్ల శ్రద్ధ, అభిరుచి ,సేవా భావంతో చేసిన పనులు మనందరికీ స్ఫూర్తి. ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికి తన లక్ష్యాన్ని చేరుకునే శక్తి నిచ్చింది. లూయిస్ బ్రెయిలి పేరు చరిత్రలో శాశ్వతంగా నిలిచి అంధుల హక్కుల కాంతి వంతమైన చిహ్నంగా నిలుస్తుందని , లూయి బ్రెయిలీ జన్మదిన వేడుకలు సందర్భముగా అంధులకు జ్ఞాపకం అందజేశారు. అనంతరం బ్లైండ్ స్టిక్స్ ను పంపిణీ చేశారు. జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కారానికి ప్రతి నెల మొదటి శనివారం ప్రత్యేక ప్రజావాణిని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా శనివారం నిర్వహించిన ప్రజావాణిలో 14 దరఖాస్తులు అందాయని తెలిపారు. అందులో పెన్షన్ల కొరకు, ఉపకరణముల కొరకు దరఖాస్తుల అందాయని తెలిపారు . ఈ ప్రత్యేక ప్రజావాణి దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికై ఇక నుండి ప్రతి నెల మొదటి శనివారం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.



దివ్యాంగుల కొరకు ప్రైవేట్ రంగంలో జాబులు కొరకు జిల్లా ఉపాధి అధికారి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం ఆడిటోరియంలో యందు ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా లోని నిరుద్యోలైన దివ్యాంగులు తగిన విద్యార్థులు గల ధృపత్రాలతో హాజరై ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు . ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజారాణి, జడ్పి సీఈవో జానకి రెడ్డి , జిల్లా సంక్షేమ అధికాణి, శ్రీమతి కె లలిత కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ అనిల్ కుమార్, జిల్లా అంధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎస్. ప్రవీణ్ కుమార్ ,ఏ లక్ష్మణ్ , కే మహేష్ ,జ్ఞానేశ్వర్ , విట్టల్, జుబేదా, రాంశెట్టి , తదితరులు పాల్గొన్నారు.